విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

పెన్షన్ల పంపిణీపై దృష్టి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్రంలో అర్హులైన వారిందరిని గుర్తించి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వివిధ రకాల పెన్షన్‌లు అందజేస్తున్నారని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వివిధ రకాల సంక్షేమ పథకాలతో పాటు ప్రధానంగా పెన్షన్‌లు పంపిణీపై సీఎం దృష్టి సారించారన్నారు. మండలంలో వివిధ గ్రామాలకు సంబంధించి వివిధ రకాల నూతన పెన్షన్‌లకు సంబంధించి 290 పెన్షన్‌లు లబ్దిదారులకు స్థానిక సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఎంపిడివో దాసరి అనురాధ సారథ్యంలో ఎమ్మెల్యే చేతులు మీదుగా గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైకాపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జీఓ1 అప్రజాస్వామికం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సభలు, ర్యాలీలు అనుమతించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 1 అప్రజాస్వామికమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. గురువారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞతతో యోచించి అప్రజాస్వామిక జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బ్రిటీష్ పాలన నాటి పోలీస్ చట్టాన్ని దుమ్ము దులిపి వెలికి తీయటంతోనే సర్కార్ ఆలోచన స్పష్టమౌతుందని, ప్రజాస్వామ్య మంటే ప్రజాభిప్రాయమని అన్నారు. దీనిని ఏ రూపంలో కళ్లెం వేయటానికి చేసే ప్రయత్నాలైనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ కోవలోనిదేనన్నారు. విద్యావేత్త ఆర్‌వి సింగరయ్య మాట్లాడుతూ ఏ రోడ్లపైన అయితే రోడ్‌షోలు, ప్రదర్శనలు, సభలు నిషేధమంటూ జీఓ జారీ చేశారో ఆ రోడ్లపైన పాదయాత్ర చేయడం ద్వారానే జగన్‌మోహన్‌రెడ్డి అధికారానికి బాటలు వేసుకున్నారనేది గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ జీఓను తిప్పి కొట్టటానికి ప్రతి ఒక్కరూ కదలాలన్నారు. చంద్రయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో నూతన పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిషత్ కార్యాలయంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే పాల్గొని నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 9289 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేస్తారన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, లంచాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి కులమతాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. నియోజక వర్గ వ్యాప్తంగా 40,000 పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒకటో తారీకు వృద్ధులకు వితంతువులకు, వికలాంగులకు ఇలా 13 రకాల పెన్షన్లను అందజేస్తున్నారని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యులు మేకతోటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన 40 కుటుంబాలు

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని పేరుకలపూడిలో ఎమ్మెల్యే ఆర్కే సమక్షంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాలు గురువారం వైసీపీలో చేరాయి. బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి చెందిన బీసీ కుటుంబాలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైసీపీలో చేరారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, గ్రామ సర్పంచ్ గంపల గంగాధర్, పార్టీ నాయకులు నూతలపాటి కేశవరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, మహేష్, చక్రవర్తి తదితరులు ఉన్నారు.

వ్యాపారస్తులు చెత్తబుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెనాలి : పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారస్తులు చెత్తను రోడ్డు మీద వేయకుండా తమ షాపుల ముందు చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ జశ్వంతరావు తెలిపారు. గురువారం ఉత్తర్వులు జారీచేశారు. బుట్టలను ఏర్పాటు చేశారు. చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవడం వలన షాపుల ముందు పరిశుభ్రంగా ఉంటుందన్నారు. పట్టణం సుందరంగా ఉండేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆరోగ్యశాధికారి డా॥కె. హెలెన్ నిర్మల మాట్లాడుతూ షాపుల ముందు చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకొని వారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు, నగరదీపికలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన PIRAMAL CAPITAL & HOUSING FINANCE LTD., గుంటూరువారి సూచనలమేరకు యావన్మందికీ తెలియ జేయునదిఏమనగా, నాక్లయింటు వద్దకు గుంటూరుజిల్లా, తెనాలిటౌన్, సాలిపేట, అక్కలవారి వీధి, డోర్.నెం.16-8-3 కాపురస్తులు షిండే భాస్కరరావుగారి కుమారుడు రవి భాస్కర్ గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది.09-12-2022న విక్రయ అగ్రిమెంటు ద్వారా కొనుగోలుచేయుటకు బాపట్లజిల్లా, రేపల్లె పట్టణం, 9వ వార్డు, కోటావారి వీధి కాపురస్తులు శ్రీమతి మాజేటి శైలశ్రీ, భర్త.వెంకటపున్నయ్య గారితో విక్రయ ఖరారుపడి వున్నారు. సదరు ఆస్తి ది.14-07-2016న మాజేటి శైలశ్రీగారు విక్రయ ద.నెం.3743/2016గా యస్.ఆర్.ఓ. తెనాలి ద్వారా విక్రయం పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్న ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజులలో ఒక ఒరిజినల్ లింకు దస్తావేజు అనగా గుగ్గిలం రామమోహనరావు గారి పేరుతో ది.28-06-2013న యస్.ఆర్.ఓ. తెనాలిలో విక్రయ ద.నెం.3985/2013గా రిజిష్టరు కాబడిన దస్తావేజు పోయినదని దొరికినవారు నాక్లయింటుకు గాని, నాకు గాని తెచ్చి యివ్వగలరు. అట్టి ఆస్తిని షిండే రవికుమార్ గారు సదరు శైలశ్రీ గారితో విక్రయ ఖరారు పడి సదరు ఆస్తిపై ఋణంకొరకు నాక్లయింటును సంప్రదించి యున్నారు. అట్టి ఆస్తికి నాక్లయింటు ఋణము మంజూరు చేయుచున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపై గాని, మంజూరు చేయు ఋణముపైగాని ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 15రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిస్సేచి ఆస్తిగా పరిగణించబడునని మరియు గడువు అనంతరము వచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు:గుంటూరు డి॥, తెనాలి రి.డి॥, తెనాలి మున్సిపల్ టౌన్ సర్వే దాఖలా 1వ వార్డు,17వ బ్లాకు టి.యస్.నెం.623/1 య. 1-70సెంట్లు మింజుమలె య.0-70సెంట్లలో ప్లాట్ నెం.16 డోర్.నెం.14-51-1 సమీపమున గల చ.గ.84-7లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.తూర్పు:కుప్పాల జయలక్ష్మిగారి ఆస్తి హద్దు అ.32-6లు, దక్షిణం: అ.20లు వెడల్పుగల రోడ్డు హద్దు,అ.24-7లు, పడమర:ప్లాట్ నెం.17 దాఖలా స్థలము హద్దు,అ.33లు, ఉత్తరం:కంచర్ల లక్ష్మిగారి ప్లాటు నెం.14రు దాఖలా స్థలము హద్దు, అ.22లు.

M/s. KOTAMRAJU LAW ASSOCIATES
D.No.87-142/1, Sambasiva Nagar, Lalpuram Road, Chuttugunta, Guntur. Cell :9490343123

కోర్టు నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం:30/2022

బిట్వీన్:
చెన్నుబోయిన ఆదినారాయణ - వాది
మరియు
గుడిపాటి దేవయ్య వగైరాలు - ప్రతివాదులు,
డి-3: ఆర్లగడ్డ సామ్రాజ్యం. లేటు అర్జున, నివాసం. లాం జొన్నలగడ్డ (గ్రామము, గుంటూరు (రూరల్ మండలం & జిల్లా)

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా నమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 27-01-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చుడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 27-01-2023
వి. వెంకటేశ్వర్లు,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల లబ్ధిని సచివాలయ, వాలంటీర్‌వ్యవస్థ ద్వారా ఇంటిముంగింటకే అందిస్తున్నామని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి అన్నారు. గురువారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వైఎస్సార్ ఫించన్ కానుక పెంపుదల వారోత్సవాల సభలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేద అవ్వ, తాతలకు, వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ అర్హత నిబంధనలను సడలించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి పథకాలు అమలు చేస్తున్న మానవత విలువలు ఉన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ కరోనా వలన ప్రపంచంతో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న ముఖ్యమంత్రి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీనే ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నారన్నారు. అనంతరం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్లను లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయరు షేక్ సజీలా, అదనపు కమిషనర్ పెద్ది రోజ, డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కళ్లంలో సంకల్ప్-2023 వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు శివారులోని కళ్ళం హరనాధ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక విద్యార్థుల సదస్సు 'సంకల్ప్-2023' వేడుకలను గురువారం గుంటూరు రైల్వే డివి జనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతిక విద్యారంగంలో ప్రతి విద్యార్థి వ్యక్తిగత నైపుణ్యాలతో మాత్రమే విజయాలను సాధించేకంటే టీమ్ వర్క్ ద్వారా అత్యున్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర రెడ్డి మాట్లాడుతూ ఈ సాంకేతిక సదస్సుకు 2000 మందికి పైగా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచి విచ్చేయడమే కాకుండా వివిధ సాంకేతిక విభాగాలైన రోబో ఛాలెంజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడింగ్, హేకతాన్, పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్ నందు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ సదస్సులో కాళాశాల చైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ పి.వెంకటేశ్వర రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళ్ళం నవ్య, ఇండస్ట్రీయల్ రిలేషన్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, సదస్సు కన్వీనర్ బి.రామచంద్రయ్య, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. చివరిగా సాంకేతిక, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు రూ.2 లక్షల విలువైన బహుమతులను అందజేశారు.

'అదామా ఫ్లైహై' డ్రోన్ స్ప్రే ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రైతులు పురుగు మందులను పిచికారీ చేసేందుకు అదామా ఇండియా వారి 'అదామా ఫ్లైహై' డ్రోన్ స్ప్రేను స్థానిక ఓ హోటల్‌లో అదామా ఇండియా సీఈవో షాహిన్ ఓజ్కాన్ రైతులు, రిటైలర్లు, అదామా టీం సమక్షంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో కూలీల కొరత నానాటికి పెరిగిపోతోంది. దీనికి పరిష్కారంగా రైతుల కోసం డ్రోన్ స్ప్రేయింగ్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు తమ పంటపై మెరుగ్గా, ఏకరీతిలో సరిసమానంగా పిచికారీ చేయడంతో పాటు వ్యవసాయ కూలీల కొరతను పరిష్కరించడంలో సహాయపడతాయని వివరించారు. అధునాతన సాంకేతికత గల ఈ డ్రోన్ స్ప్రేయింగ్, రైతుల సమయాన్ని ఆదా చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీ ప్రసాద్, మేనేజర్ హరీష్ చంద్ర, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నర్రాజు గోపాలరావు కళావేదిక ప్రారంభం

విశాలాంధ్ర-తెనాలి : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయులేనని వారిని గౌరవించాలని పూర్వ విద్యార్థి, ఎన్.ఆర్.ఐ. ఆళ్ళ శ్రీనివాసరెడ్డి చెప్పారు. కొల్లిపర మండల గ్రామం మున్నంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన నర్రాజు గోపాలరావు మాస్టారు స్మారక కళావేదిక ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రధానో పాధ్యాయిని కె.అరుణకుమారి అధ్యక్షత వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను చదువు కున్న బడిలో పాఠాలు నేర్పిన గురువు గోపాలరావు మాస్టారు స్మారక కళావేదికను నిర్మించే అవకాశం తనకు రావటం సంతోషదాయకం అన్నారు. గోపా లరావు మాస్టారు పాఠం చెప్పిన క్రమశిక్షణ, విధ్యుక్త ధర్మం చిరస్మరణీయమన్నారు. నేటి ఉపాధ్యాయులు ఆయన బాటలో పయనించాలన్నారు. కళావేదికను ఆ పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు ప్రారంభించి మాట్లా డుతూ విద్యార్థులు శ్రీనివాసరెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తాము చదివిన పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. సాంబశివరావు మాస్టారును శ్రీనివాసరెడ్డి, అరుణకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వ్యాఖ్యాతగా నటుడు, దర్శకుడు వంగా లక్ష్మారెడ్డి వ్యవహరించారు. గోపాలరెడ్డి కుమారుడు బాలచందర్, ఎ.ఆర్.కళాశాల, కొల్లిపర కోశాధికారి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, ఆరిగ కోటిరెడ్డి, ఆళ్ళ శివనాగిరెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

8న 'శాస్త్రీయ యోగా, ప్రాణాయామాలు'పై ఆరోగ్య సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అవగాహన సంస్థ క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా ఆదివారం ఉదయం 11గంటలకు స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'శాస్త్రీయ యోగాసన, ప్రాణాయామాలు'పై ఆరోగ్య సభ జరుగుతుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యోగా గురువులు జి.చంద్రకాంత్, వివి చలపతిరావులు ప్రధాన వక్తలుగా పాల్గొని పాల్గొంటారన్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ) గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాష మంగళగిరి మున్సిపల్ కమిషనర్ శారదాదేవికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలంటూ మంగళగిరి మున్సిపల్ కమిషనర్ యూ.శారదాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన శారదాదేవి తప్పనిసరిగా ఉద్యోగుల పదోన్నతుల కోసం కృషి చేస్తానన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్.చిన్న రామిరెడ్డి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు.

చీకటి జీఓలతో ప్రతిపక్షాలపై కక్ష

విశాలాంధ్ర-గుంటూరు : చీకటి జీఓలతో ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ విమర్శించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు మద్దతుగా కుప్పంలో జరిగిన సంఘటనకు సంఘీభావం తెలిపేందుకు సన్నద్ధమవుతున్న డేగల ప్రభాకర్‌ను గురువారం గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్ని అరాచకాలకు పాల్పడినా ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తగ్గదని అన్నారు. తల్లకిందులుగా తపస్సు చేసినా చంద్రబాబు కుప్పం పర్యటన ఆపటం సాధ్యం కాదన్నారు. 1861 పోలీస్ యాక్ట్ పేరుతో జీవో నెంబర్ 1 తెచ్చి ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. తక్షణమే జీఓ నెం 1 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జీఆర్‌జీ ఈబైక్స్ నూతన షోరూం ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక నగరం పాలెం సెంటర్‌లో జీఆర్‌జీ ఈ బైక్స్ నూతన షోరూం గురువారం ఉదయం ప్రారంభించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ జీఎస్టీ సీహెచ్ విల్సన్ బాబు, ఆర్.టి.ఐ కమిషనర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పి శామ్యూల్ జోనాథన్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ నాయబ్ కమాల్, రిటైర్డు కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ టివి రావు, పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం సుధాకర్‌ల చేతుల మీదుగా షోరూం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ రేట్ల కారణంగా కాలుష్య రహిత వాహనాలను యువత ఎక్కువగా ఆదరిస్తున్నార న్నారు. సహజ ఇంధన వనరుల పొదుపుకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత విద్యుత్ వాహనాలను వినియోగంలోకి మరింతగా తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో రుణాల అందిస్తూ ఈ బైక్ కొనుగోలు మరింతగా ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయమని వక్తలు పేర్కొన్నారు.

జీఓకు వ్యతిరేకంగా టీడీపీ నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబరు 1ని రద్దు చేయాలని, కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు సభను అడ్డుకోవడం, కార్యకర్తలపై జరిగిన లాఠీఛార్జిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా తాడేపల్లి పట్టణంలో టీడీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. నిరసన కార్యక్రమం చేపట్టిన నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి తాడేపల్లి స్టేషన్ తరలించారు. స్టేషన్‌లో నిరసన తెలుపుతూ జీవో నెంబరు 1 ప్రతులను చించివేశారు. అరెస్టు అయిన వారిలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు సీహెచ్ శివుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి దారాదాసు, గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి బెజ్జం రామకృష్ణరావు(ఆర్కే), మంగళగిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, మంగళగిరి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు కేటీపీ ప్రసాద్, సీనియర్ నాయకులు ఉయ్యాల కోటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ లీగల్ సెల్ అధికార ప్రతినిధి శివరాజేష్ రెడ్డి, మంగళగిరి ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి నవీన్ వినుకొండ, మంగళగిరి మహిళా అధికార ప్రతినిధి ఈశ్వరి, తాడేపల్లి పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంభం సాయిచంద్, తాడేపల్లి పట్టణ ఐటీడీపీ కన్వీనర్ నరేష్ ఆడపా, తాడేపల్లి పట్టణ బీసీ కార్యదర్శి సింహాచలం, తాడేపల్లి మహిళా అధ్యక్షురాలు అన్నెం కుసుమ, తాడేపల్లి పట్టణ యువత అధ్యక్షులు జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఏపీ ఎస్ఆర్ఎం

విశాలాంధ్ర-మంగళగిరి : మహారాష్ట్రలోని నాగపూర్ ఆర్టీఎం యూనివర్సిటీలో జరుగుతున్న 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార, అవగాహన కేంద్రానికి విశేషమైన స్పందన లభిస్తోంది. ఈ నెల 3న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్యమాధ్యమ పద్ధతిలో 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారం భించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కొశ్యారీ, ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవీస్‌లు ముఖ్య అతిథులుగా హాజరైన సైన్స్ కాంగ్రెస్ ప్రారంభ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, శాస్త్రవేత్తలు, పరిశోధనా రంగ నిపుణులు తరలివచ్చారు. డీఆర్డీవో, సీఎస్ఐఆర్, ఇస్రో వంటి దేశ రక్షణ, పరిశోధనా రంగ సంస్థలతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన పలు విద్యా, వ్యాపార సంస్థలు సైన్స్ కాంగ్రెస్ ప్రాంగణంలో ప్రత్యేక అవగాహనా కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఇందులో భాగంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ బోధన, పరిశోధన లక్ష్యమన్న నినాదంతో ఉన్నత విద్యా ప్రాముఖ్యతలను తెలియపరుస్తూ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇంజినీరింగ్, లిబరల్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ బిజినెస్ కోర్సుల్లో ఎస్ఆర్ఎం అందిస్తోన్న విద్యా విధానం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి నాగపూర్ ఏరియా మేనేజర్ అనూప్ కుమార్ విద్యార్థులకు వివరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నాగపూర్, గడ్చిరోలి, అమరావతి, విదర్భ, బండారా, పూనే, కోల్హాపూర్, చత్తీస్‌ఘడ్ ప్రాంతాల నుంచి వేలాది మంది విద్యార్థులు సైన్స్ కాంగ్రెస్‌కు హాజరై ఎస్ఆర్ఎం సెంటర్‌ను సందర్శించి కోర్సుల వివరాలను తెలుసుకుంటున్నారు.

నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్‌తో సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సూట్స్ కేర్ నెట్ వర్క్‌తో నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ నరసరావుపేట కళాశాల హెల్త్ పార్టనర్‌గా ఒప్పందం కుదుర్చుకోవటం చాలా సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేఎస్ సురేష్ కుమార్ అన్నారు. దేశంలో అఫడ బుల్ హెల్త్ కేర్ అందుబాటులోకి తీసుకురావటానికి డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి 9 సంవత్సరాల క్రితం సూట్స్ కేర్ నెట్‌వర్క్‌ను స్థాపించి వైద్య రంగంలో ఎన్నో విప్ల వాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియా డారు. నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూ టికల్ సైన్సెస్, నరసరావుపేట హెల్త్ పార్ట్‌నర్ భాగస్వామ్యంతో కళాశాల విద్యార్థులకు వైద్యపరమైన అవగాహన కార్యక్రమాల నిర్వహణ, నెలకొకసారి మెడికల్ క్యాంప్ నిర్వహించటమే కాకుండా విద్యార్థు లతో పాటు వారి తల్లితండ్రుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను సూట్స్ కేర్ నెట్‌వర్క్ అందిస్తుందని సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఏహెచ్‌సీ విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే కొన్ని విద్యా సంస్థలతో హెల్త్ పార్టనర్‌గా ఒప్పదం కుదుర్చుకున్న సూట్స్ కేర్ నెట్‌వర్క్ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అన్ని విద్యా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుం టుందన్నారు. దీంతో రాష్ట్రంలో అఫడబుల్ హెల్త్ కేర్ తీసుకొని రావడానికి కృషి చేస్తుందని వెల్లడించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జెఎస్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఎటువంటి చిన్న ఇబ్బంది వచ్చినా వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవటం వలన భవిష్యత్తులో రాబోయే ఆరోగ్యపరమైన ఇబ్బందులను అధిగమించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్, నరసరావుపేట జేఈడీఎస్ డైరెక్టర్ కిశోర్‌బాబు, ఫార్మా.డి ఇన్‌ఛార్జ్ భవ్యసాయి, సూట్స్ కేర్ నెట్‌వర్క్ పెమ్స్ ప్రమోషన్ టీం ఇన్‌ఛార్జ్ కృష్ణ దేశముఖ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి: జంగాల

విశాలాంధ్ర-తాడి కొండ : జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రతి లబ్ధి దారునికి రూ.5 లక్షలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. పొన్నెకల్లు గ్రామ సీపీఐ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ పేదల ప్రయోజ నాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను కేటాయించిందని గుర్తుచేశారు. అయితే ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఎలా సరిపోతాయని దానిని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను టిడ్కో పనులను సీపీఐ పరిశీలిస్తుందన్నారు. ఈ నెల 25న విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం దీక్షలు చేపట్టాలని ఫిబ్రవరి 6న జగనన్న కాలనీ లబ్ధిదారులు, టిడ్కో లబ్ధిదారులతో జిల్లా స్థాయిలో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 22న విజయవాడ నగరంలో లబ్ధిదారులతో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, నాయకులు గుర్రంకొండ సత్యానందం, షేక్ నాగుల్ మీరా, రామినేని రామారావు, జాల మరియదాసు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ ఆందోళనలో భాగస్వాములు కావాలి: వెలుగూరి

విశాలాంధ్ర-గుంటూరు : విశాఖ ఉక్కు పరిరక్షణకై ఈ నెల 23, 24, 25 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళన కార్యక్ర మాలలో యావత్ కార్మిక వర్గం భాగస్వాములు కావా లని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెలుగూరి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా 23,24 తేదీలలో ఆయా రెవిన్యూ డివిజన్‌లలో ఆందోళనలు నిర్వహిం చాలని, 25వ తేదిన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీతో కలిసి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత 600 రోజులుగా ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం జరుగుతున్నప్పటికి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉద్యమం చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ ఉద్యమాన్ని భవిష్యత్తులో మరింత ఉధృతంగా నిర్వహించ డానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నరేంద్ర మోదీని తొలగించండి... కార్మికవర్గాన్ని రక్షించండి అనే నినాదంతో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ఇటీవల కేరళ రాష్ట్రం అలపిలో జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభలలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్‌కుమార్, నాయకులు పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఓను వెంటనే రద్దు చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-చెరుకుపల్లి : ప్రతిపక్ష పార్టీల గొంతును నొక్కాలని బ్రిటీష్ కాలం నాటి 1861 పోలీసు యాక్టు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 1ని తీసుకురావడం దుర్మార్గమని బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి పి.నాగాంజనేయులు ఆరోపించారు. గురువారం చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19లోని భావవ్యక్తీకరణ, స్వేచ్ఛను హరించే విధంగా తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఇతర రాజకీయ పార్టీల కార్యక్రమాలను అడ్డుకుంటూ తమ వైసీపీ మినహ ఏ రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించరాదని కర్కశంగా ఆంక్షలు విధించడం సరైనది కాదని నాగాంజనేయులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 1ని రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిని భావవ్యక్తీకరణ, స్వేచ్ఛ ప్రాథమిక హక్కులను కాలరాస్తు రాష్ట్ర ప్రభుత్వం అరాచకం పాలన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఎటువంటి నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని ఆంక్షలు విధిస్తూ తీసుకువచ్చిన జీఓను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చొక్కాకులు శివ శంకర్, ముత్యాల వెంకటేశ్వర్లు, సిరంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India

కొత్తపేట బ్రాంచి,
హెచ్.నెం.12-12-83, ఓల్డ్‌క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు. ఫోన్ : 0863-2263445
E-Mail: ubin0564087@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తిపై)

రూలు 8(1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తపేట బ్రాంచి, గుంటూరు** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సదరు చట్టంలోని సెక్షన్ 13(2)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 9 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత(లు) : 1) మెస్సర్స్ హేమశ్రీ కాటన్ కార్పొరేషన్,** యజమాని : ఐత్తుల జ్యోతి, భర్త : శ్రీనివాసరావు, ఫ్లాట్ నెం.301, బృందావన్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్, 1/1, ఉద్యోగనగర్, గుంటూరు-522003, **2) శ్రీమతి ఐత్తుల జ్యోతి, భర్త : శ్రీనివాసరావు,** ఫ్లాట్ నెం.301, బృందావన్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్, 1/1, ఉద్యోగనగర్, గుంటూరు-522003, **3) శ్రీ ఐత్తుల శ్రీనివాసరావు,** ఫ్లాట్ నెం.301, బృందావన్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్, 1/1, ఉద్యోగనగర్, గుంటూరు-522003 వారు బకాయి సొమ్ము **రూ.56,98,133.62 పై॥ (అక్షరాల యాభైఆరు లక్షల తొంభైఎనిమిది వేల నూటముప్పైమూడు రూపాయలు మరియు పైసలు అరవైరెండు మాత్రము) తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.31-10-2022న** డిమాండు నోటీసు జారీచేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 9 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.05-01-2023న స్వాధీనం** చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి పడిన సొమ్ము **రూ.56,98,133.62 పై॥ (అక్షరాల యాభైఆరు లక్షల తొంభైఎనిమిది వేల నూటముప్పైమూడు రూపాయలు మరియు పైసలు అరవైరెండు మాత్రము)**(నోటీసు తరువాత చెల్లించిన అమౌంట్ తగ్గించబడును) మరియు తదుపరి జమకూడు వడ్డీ, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తపేట బ్రాంచి, గుంటూరు వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది. సదరు చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరములు

గుంటూరు సిటీ, గుజ్జనగుళ్ళ, కొరిటెపాడు గ్రామము, ఉద్యోగనగర్ మెయిన్ రోడ్ లోని డి.నెం.253/బి & సి, 259/బి, సి & డి, 260/ఎ, & బి, 274/ఎ, బి, సి & డి లోని ప్లాట్ నెం.162, 164, 163, సమీప డోరు నెం.1-33-1 నందు మొత్తం 798.00 చ॥గ॥లు లేదా 667.20 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలములో నిర్మించిన బృందావన్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్, 2వ అంతస్తులో 1650 చ॥అ॥ విస్తీర్ణముగల ఫ్లాట్ నెం.301 మరియు అవిభాజ్యపు భాగమైన 65.00 చ॥గ॥లు లేదా 54.37 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలమునకు సంబంధించి న్యాయసమ్మతంగా తనఖాపుంచబడిన యావదాస్తి. స్థలము(మొత్తం ప్రాజెక్ట్)నకు హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.165, దక్షిణం : 33 అ॥ల వెడల్పుగల రోడ్డు, పడమర : ప్లాట్ నెం.161, ఉత్తరం : ప్లాట్ నెం.177, 178, 179. ఫ్లాట్‌కు హద్దులు : తూర్పు : శూన్యాకాశము & ఉమ్మడి వరండా & ఉమ్మడి లిఫ్ట్, దక్షిణం : శూన్యాకాశము, పడమర : శూన్యాకాశము, ఉత్తరం : ఐత్తుల శ్రీనివాసరావు యొక్క శూన్యాకాశము.

స్థలం: గుంటూరు
తేది: 05-01-2023
సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తపేట బ్రాంచి, గుంటూరు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-నూజెండ్ల : సీజనల్ వ్యాధులపైన అవగాహన సదస్సు, వైద్య శిబిరంను ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ గురువారం మండలంలోని ములకలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం, చలికాలంలో జలుబు, దగ్గు జ్వరాలు, కడుపునొప్పి వాంతులు, విరేచనాలు మొదలగు వ్యాధులు వస్తాయని, కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, దోమ కాటు వలన వచ్చే వ్యాధులు మలేరియా ఫైలేరియా డెంగ్యూ చికెన్ గున్యా, స్వైన్ ఫ్లూ మొదలగు వ్యాధులు వస్తాయని దోమతెరలు వాడాలని తెలియపరిచారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడానికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కావూరి శ్రీనివాసరావు, లక్ష్మీజీరావు, కంచర్ల నారాయణ, అన్నలూరు కోటేశ్వరరావు, ఆయుష్ సిబ్బంది రాజశేఖర్, యోగా టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లోని స్కాలర్స్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో సంక్రాంతి క్రీడా సంబరాలలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా జిల్లా క్రికెట్ సెలెక్షన్ కమిటీ మెంబర్ నాగరాజు పల్నాడు హాస్పిటల్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పట్టణ వైస్ చైర్మన్ జలాలుద్దీన్, స్కాలర్స్ విద్యా సంస్థలు డైరెక్టర్‌లు శ్రీనివాసరెడ్డి, జగదీష్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అవుల జనార్దన్ రావు, కౌన్సిలర్స్ కొక్కెర శ్రీనివాసరావు, బాలస్వామి, క్రీడాకారులు జొన్నలగడ్డ రమేష్, పుల్లారావు, టోర్నమెంట్ ఆర్గనైజర్ రఫీ, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు. 6 టీమ్‌లు పాల్గొన్నాయని కమిటీ సభ్యులు తెలిపారు.

పింఛన్ పెంపుతో ఆర్థిక భరోసా

విశాలాంధ్ర-శావల్యాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ సొమ్మును రూ.2500 నుంచి రూ.2750లకు పెంచి లబ్ధిదారుల ఆత్మగౌరవంతో పాటు ఆర్థిక భరోసాను కూడా కల్పించాడని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పథకాలను ప్రజలందరికీ పార్టీలకతీతంగా అందజేయాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్నారని తెలిపారు. నా సొంత గ్రామంలో బాదుడే బాదుడు కార్యక్రమంలో నేను గ్రామంలో ఒక్క తట్ట మట్టి కూడా పోయలేదని విమర్శించారని, నేను సభా ముఖంగా అడుగుతున్నాను నేను వేల్పూరుకి ఏమి చేశానో, నీవు నీ సొంత ఊరికి ఏమిచేశావో చర్చకు సిద్ధమా అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎంకు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగన్‌ను ఎదుర్కోలేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి వెంకట రెడ్డి, ఎంపీడీఓ పేరుమీన శీతారామయ్య, తహశీల్దార్ షేక్ జాన్ సైదులు, ఎస్సై గర్నా రవికృష్ణ, ఏపీఎం వాసుబాబు, స్త్రీ నిధి మేనేజర్ రంతు చిన్న బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తినేని నరసింహారావుకు నివాళి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని విష్ణుకుండీ నగర్‌లో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ముత్తినేని నరసింహారావు పెదకర్మ సందర్భంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : శ్రామికులు, సామాన్యులు, ప్రజల పక్షాన నిలిచే పత్రిక విశాలాంధ్ర అని తెలుగుదేశం పార్టీ పిట్టలవానిపాలెం మండల అధ్యక్షులు ఎండీ అఫ్జల్, తెలుగుదేశం పార్టీ పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు సోపాటీ గ్లోరీ యానెట్ అన్నారు. తెలుగు జాతీయ దినపత్రిక "విశాలాంధ్ర" - 2023 సంవత్సరం క్యాలండర్‌ను గురువారం మండల పరిధిలోని చందోలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాలాంధ్ర దిన పత్రిక అందరి పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ తనకంటూ నేటి సమాజంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవడం అభినందనీయమన్నారు. కార్మిక కర్షక పక్షాన నిలుస్తున్న విశాలాంధ్ర దినపత్రిక నూతన క్యాలెండర్ తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రత్యేక పాత్ర పోషిస్తున్న విశాలాంధ్ర దిన పత్రిక మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. విశాలాంధ్ర ప్రజల సమస్యలను అన్ని కోణాల్లో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి తెలియజేయడంలో ముందుంటుందన్నారు. విశాలాంధ్ర దినపత్రిక ప్రజల పక్షాన అనే కథనాలు ప్రచురిస్తుందని కొనియాడారు. తెలుగు ప్రజల జాతీయాభిమానాన్ని, ఆకాంక్షలనూ ప్రతిబింబిస్తూ ప్రజాభిమానం పొందిన పత్రిక విశాలాంధ్ర మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో చందోలు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ రజాక్, బాపట్ల నియోజకవర్గ రైతు కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి బర్మా దిలీప్, టీడీపీ నాయకులు రవి, సలీమ్, పిట్టలవానిపాలెం మండల విశాలాంధ్ర విలేకరి ఆదాం తదితరులు ఉన్నారు.

నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గురువారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారికి నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఈ మిషన్ ద్వారా ప్రతి గ్రామం ప్రతి మనిషికి ప్రతి రోజు 55 లీటర్ల మంచినీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రామస్తులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షితమైన మంచినీటిని త్రాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చీకటి జీవో విరమించుకునే వరకూ ఉద్యమం: సీపీఐ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు జరగకూడదని తీసుకొచ్చిన చీకటి జీఓను ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ స్పష్టం చేశారు. జీఓకు వ్యతిరేకంగా గురువారం సీపీఐ కార్యాలయం నుంచి ఎన్ఆర్‌టి సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకుడు బొంతా భగత్ సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీఓ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీఓ ముఖ్యంగా పేదల కోసం, అట్టడుగు వర్గాల ప్రజల కోసం వారి సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్యయుతంగా తెలిపే నిరసనలకు పెను విఘాతంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్రం రాక పూర్వం 1861లో బ్రిటీష్ ప్రభుత్వం భారతీయుల ఆందోళనలను అణచడానికి ఈ జీఓ తెచ్చిందని అన్నారు. ఇటీవల ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనలు వారికి కునుకు పట్టనీయకుండా చేస్తున్నాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే రోడ్ల కూడళ్లలో సభలకు అనుమతి ఇవ్వమని చెప్పడం సరికాదన్నారు. ఒక విధంగా ఇది ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడే వ్యక్తులు, శక్తులు నోరు నొక్కడమేనని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా కలిసి వచ్చే శక్తులను కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు బి.శేషయ్య, ఆరాధ్యుల రామకృష్ణ, తంగిరాల జీవరత్నం, చౌటుపల్లి నాగేశ్వరరావు, లలిత కుమారి, పి.శివలీల, నాయుడు శివ, గూడూరు సుబ్బాయమ్మ, తోట నరసమ్మ, కె.వెంకటేశ్వర్లు, నాజర్, సామ్యూల్ పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త అరెస్ట్

విశాలాంధ్ర-మాచర్ల : కట్టుకున్న భార్యను బండరాయితో మోది హత్యకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టి.బాలకృష్ణ తెలిపారు. అర్బన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 1వ వార్డుకు చెందిన ఓలిపోయిన అంజలి(30)కి గురజాలకు చెందిన ఓలిపోయిన లక్ష్మయ్యతో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. రెండేళ్ల తరువాత భార్య అంజలిపై అనుమానం పెంచుకొని తరచూ గొడవకు దిగుతుండేవాడు. ఇటీవల పెద్దల సహకారంతో కొంతకాలం వీరిద్దరూ పట్టణంలోని జయంతి నగర్‌లో కాపురం ఉంచారు. అప్పటికి లక్ష్మయ్యలో మార్పు రాకపోవడం, తరచూ అంజలిపై చేయి చేసుకోవటం జరిగింది. ఇలా రోజురోజుకీ గొడవలు అధికం కావడంతో ఇద్దరు విడిపోయారు. అప్పటినుంచి భార్య అంజలిని హతమార్చేందుకు లక్ష్మయ్య పథకం పూనుకున్నాడన్నారు. అయితే గత నెల 31న పట్టణానికి చెందిన ఒక పాస్టర్ జయంతి నగర్‌లో పేదలకు ఉచితంగా బట్టల పంపిణీ కార్యక్రమం చేస్తున్నట్లు తెలియడంతో అంజలి తన ఇద్దరు పిల్లలతో అక్కడికి చేరుకుంది. సమాచారం అందుకున్న లక్ష్మయ్య అప్పటికే పథకం ప్రకారం అక్కడకు చేరుకొని మాయమాటలతో పిల్లలను దూరంగా పంపించాడు. వెంటనే పక్కనే ఉన్న ఎర్ర బండరాయితో అంజలి ముఖం, తలపై గట్టిగా మోది పారిపోయాడు. గమనించిన కాలనీవాసులు తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో పడి ఉన్న అంజలిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంజలి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్టు సీఐ పేర్కొన్నారు. మృతురాలి తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు లక్ష్మయ్యపై ఐపీసీ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐలు రంగస్ రాజన్, అరుణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడమే బీజేపీ నైజం

విశాలాంధ్ర-వినుకొండ: నమ్మించి మోసం చేయడమే బీజేపీ నైజం అని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి చిరుగురి నాగరాజు అన్నారు. గురువారం స్థానిక జాషువా కళా ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 1996లో వెంకటేశ్వర స్వామి సాక్షిగా తిరుపతిలో ఎస్సీ వర్గీకరణపై బీజేపీ తీర్మానం చేసిందన్నారు. రాష్ట్ర విభజన తరువాత శ్రీరాముడి సాక్షిగా భద్రాచలంలో కూడా తీర్మానం చేసిందని కానీ ఆ తీర్మానాలను అమలు చేయకుండా దేవుళ్ళను కూడా మోసం చేసిన చరిత్ర బీజేపీ పార్టీదని అన్నారు. మాదిగలను మోసం చేస్తున్న విషయాలను తెలుగు రాష్ట్రాల ప్రజలు గమనిస్తున్నారని తగిన మూల్యం బీజేపీ చెల్లించుకోక తప్పదని అన్నారు. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్ర నేతలను తీసుకెళ్లి ప్రధాన మంత్రి,హోమ్ మంత్రిని కలిసి వర్గీకరణ బిల్లుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. జనవరి 11న బెంగుళూరులో ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు ఈ సమావేశంలో మల్లవరపు రాజశేఖర్, శావల్యాపురం మండల అధ్యక్షులు చంటి, ఎమ్మెస్ పి సీనియర్ నాయకులు ఇమ్మానియేల్, హాస్టల్ మాదిగ విద్యార్థి నాయకులు అద్దంకి రాజు, పత్రా భాను ప్రకాష్, కేసనపల్లి ప్రసాద్, కందుల బేనాకర్, కాల్వ బాబు మాదిగ, రాపూరి కిషోర్ కుమార్, మల్లవరపు రవి, పిచ్చియ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-దుర్గి : విద్యార్థులు చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్సై టి.వెంకట రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, ఈవ్‌టీజింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట రమణ మాట్లాడుతూ చట్టవ్యతిరేకమైన ర్యాగింగ్, మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్ వలన కలిగేనష్టాలు గురించి అవగాహన కల్పించారు. ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమైనదన్నారు. చట్టవ్యతిరేక కార్యకమాలకు విద్యార్థులు దూరంగా ఉంటూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం అధ్యాపకుల బృందం ఎస్సై వెంకటరమణను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ వి.రమణ, ప్రోగ్రామ్ నిర్వాహకులు ఆర్‌వీఎస్ ప్రసాద్, వాహిని, లైబ్రేరియన్ బీవీ శేషగిరిరావు, సచివాలయ మహిళా పోలీస్, షేక్ నౌరీన్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సుజావుగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-శావల్యాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశ నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. మండలంలో అన్ని గ్రామాలలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఈసమావేశంలో వైస్ ఎంపీపీ నంభూరి ప్రభావతి, మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, ఎపిడి భూసిరెడ్డి, ఎంపిడివో పేరుమీన శీతారామయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్ర టీడీపీ పిలుపుమేరకు ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జీ.వి. ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ పట్టణ నాయకులు పి.వి.సురేష్ బాబు అధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను పోలీసులు అడ్డుకున్నందుకు నిరసనగా జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పోలీసుల మధ్య పెనుగులాట జరిగింది. ముందుగా పట్టణంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి శివయ్య స్తూపం వద్ద నిరసన తెలియజేశారు. రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కమిటీ సభ్యులు నలబోతుల రామ కోటేశ్వరరావు, అలాగే సీనియర్ న్యాయవాది పొట్లూరు సైదారావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాన్, సీనియర్ నాయకులు రోడ్డ వీరాంజనేయరెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబుకు, టీడీపీకి వస్తున్న జన ఆదరణ చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి ఎప్పుడో కాలం చెల్లిన పోలీస్ చట్టాలను తేవడం దుర్మార్గమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనకు కాలం చెల్లిందన్నారు. చంద్రబాబు కుప్పం పర్యటనకు వెళ్తే పోలీసులు అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటించి ఆయనను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల మురళీ కృష్ణ,పెమ్మసాని నాగేశ్వరరావు, ముంద్రు సుబ్బారావు, పత్తి పూర్ణచంద్రరావు, ఆయుఖాన్ ఆయుబ్ ఖాన్, లగడపాటి శ్రీనివాసరావు, వంకాయలపాటి పేరయ్య, ముత్తినేని ఏడుకొండలు, సౌదాగర్ జానీ భాష, మాదినేని ఆంజనేయులు, గన్నమనేని వెంకయ్య, రాపర్ల జగ్గారావు, వజ్రాల కృష్ణారెడ్డి, కర్నాటి వెంకటరెడ్డి, ఆకుమల్ల కాసిం, సోమేపల్లి బ్రహ్మయ్య, నల్లబోతుల శ్రీనివాసరావు, పువ్వాడ వెంకటకృష్ణ, యువ నాయకులు నర్రా కిషోర్, వీరగంధం ప్రశాంత్, మరిడి సురేష్, తోమాటి కాశి, అక్బర్ బాషా, కాకాని. హరిబాబు, సిద్ధపరీదు, యూత్ జానీ, ఎలిసెట్టి రంగయ్య, రావుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'గడపగడపకు': కోన

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : ప్రజాక్షేత్రంలో ప్రజల మనసులను గెలుచుకొని వారి సమస్యలను పరిష్కరించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి తెలియజేశారు. గురువారం మండలంలోని, రాంనగర్ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో శాసనసభ్యులు పాల్గొని ప్రభుత్వం అందించిన వివిధ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో మత్స్యకారులకు ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను ఆయన కరపత్రం ద్వారా వివరించారు. మత్స్యకారులు ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీర రాఘవరెడ్డి, చెంచయ్య, శ్రీనివాస రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఒడిముక్కల డేవిడ్, భాస్కర్, సుబ్బారావు, కర్లపాలెం కిషోర్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించారు..

బాపట్ల జిల్లా అభివృద్ధికి అన్ని వర్గాలు సహాయ సహకారాలు అందించారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ఏ అంజుమాన్ ఏ ఇస్లా మియా షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను సత్కరించి జిల్లా సాధనకై చేసిన కృషికి అభినందనలు తెలిపారు. అనంతరం కోన మాట్లాడుతూ జిల్లా సాధనలో అన్ని వర్గాల వారు పూర్తి సహాయ సహకారాలను అందించడమే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా నిలవడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అంజిమాన్ ఏ ఇస్లామియా అధ్యక్షులు జిలాని, కార్యవర్గ సభ్యులు ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జీఓ1 రద్దు చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం 1861 బ్రిటీష్ కాలం నాటి పోలీసు యాక్టు పేరుతో తీసుకువచ్చిన జీఓ నెంబర్ 1ని తక్షణమే రద్దు చేయాలని బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి పి.నాగాంజనేయులు, రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ వద్ద జీఓ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతును నొక్కాలని ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ జీఓలను తీసుకువస్తుం దని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలని ప్రతిపక్ష పార్టీలకు నిరసనలు తెలియజేసే హక్కు ఉందని ప్రభు త్వాలు తెలుసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అవలం భిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలలో వచ్చే వ్యతిరేకతపై నోరు నొక్కడానికి జీఓను తీసు కురావడం దుర్మార్గమన్నారు. రానున్న కాలంలో ప్రజా కంటక పాలనకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని నాగాంజనే యులు, బాలాజీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు చొక్కా కుల శివశంకర్, ముత్యాల దుర్గారావు, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశు విజ్ఞాన బడిని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-భట్టిప్రోలు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అదే విదంగా పశు విజ్ఞాన బడి ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు రైతులలో నెలకొన్న పలు సందేహాలను నివృతి చేయడం జరుగుతుందని ఎంపిపి డి. లలితకుమారి అన్నారు. మండలంలోని కోనేటిపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం నిర్వహించిన పశు విజ్ఞాన బడి, పశు వైద్యశిబిరంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ కార్యక్రమాలను రైతులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. జడ్‌పిటిసి సభ్యురాలు టి. ఉదయ భాస్కరి మాట్లాడుతూ పశు విజ్ఞాన బడి కార్యక్రమాల ద్వారా పశువుల్లో వచ్చు వివిధ వ్యాధులు, వాటి నివారణ, టీకాల అవశకతను తెలుచుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ హనుమంతరావు, రేపల్లె పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ నరేంద్ర, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

LOSS OF PASSPORT

I, KURAPATI SHAILENDRA S/o. Mahendra Pal, residing at Postal Colony, Guntur-522002, Andhra Pradesh, India. I have a Indian Passport bearing No.L7177940 which was issued on 13-02-2014. Date of Expiry 12-02-2024, Place of Issue Hyderabad. I lost my Original Passport when I went to xerox shop to take xerox copies of Passport, while I reached xerox shop at Aala Hospital, Amaravathi Road, Guntur. I realize that my Passport was missing on *26-12-2022*. If anybody found it please inform above address. Cell: 9866259788.

మహారాజశ్రీ మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
ఓ.ఎస్. 178/2008

బిట్వీన్,
గై. వెంకటేశ్వర్లు - వాది
వర్సెస్
గై. కోటయ్య వగైరా - ప్రతివాదులు
ఆర్-9 : బొల్లావుల శారద భర్త శ్రీనివాసరావు, హెచ్.నెం. : 130-7-232, బట్టీల సెంటర్ గోరంట్ల గుంటూరు.

ఐ.ఎ.4/2018 నందు రెస్పాండెంట్ నెం.9 అయిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట **ఉదయం 10:30 గంటలకు** స్వయం గాను లేదా అడ్వకేట్ ద్వారా హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయుటకు వాయిదా ఉన్నది. అట్లు మీరు హాజరు కానీ ఎడల పై ఐ.ఎ మీ వరోక్షముందు తీర్మానింపబడునని తెలియజేయడమైనది.
వాయిదా : 18-1-2023.
(మాచర్ల శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
గట్ల సత్యనారాయణ రెడ్డి
వాది తరపు అడ్వకేట్

అవకాశమిస్తే శ్రీవారికి సేవ చేస్తా..

విశాలాంధ్ర-రెంటచింతల : అవకాశమిస్తే శ్రీవారికి సేవ చేస్తానని అంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకునే నిర్ణయం మీదనే ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రెండు సార్లు టీటీడీ బోర్డు సభ్యునిగా పనిచేశానని, వైఎస్ పుణ్యాన రెండు సార్లు గురజాల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందానని, ఒకసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంపీపీ చౌడేశ్వరి, క్వారీ రామారావు, గుండా కిషోర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు నిబంధనలు ఎత్తివేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : వివిధ కుంటిసాకులతో పేదల సామాజిక పింఛన్లు ఎత్తివేసేందుకు అధికారులు సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో అడ్డగోలు నిబంధనలు, కారణాలు చూపుతూ లబ్ధిదారులకు నోటీసులు పంపడం దారుణమని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు నరిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఫించన్లు ఎత్తివేసే ప్రతిపాదనలు, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 1000 చదరపు అడుగుల నివాసస్థలం మించరాదని, కరెంటు బిల్లు, వాహనాలు, కుటుంబ సభ్యులలో ఉద్యోగులు ఉండరాదనే తదితర నిబంధనలు పెట్టి వడపోత ప్రారంభించారన్నారు. ఫించన్లు మంజూరై అనేక సంవత్సరాలుగా లబ్ధిపొందుతున్న వారు హఠాత్తుగా అనర్హులుగా ఎలా మారారో రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఫించన్లు కోత, ఏరివేత ప్రక్రియ, నోటీసులు జారీ చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అదనంగా పేదలకు ఏమీచేయలేక పోయినా ఉన్న పథకాలను తీసివేయడం, కోతలు విధించడం ద్వారా వైసీపీ పేద ప్రజల వ్యతిరేక ప్రభుత్వంగా మారిందని విమర్శించారు.

అసైన్డ్ భూముల పరిశీలన

విశాలాంధ్ర-కారెంపూడి : మండలంలోని నరమాలపాడు గ్రామంలో షెడ్యూల్ తెగలు వర్గానికి చెందిన 18 మంది రైతులు అసైన్డ్ భూములు విస్తీర్ణం 25.56 ఎకరాలు భూమి సాగు చేసుకుంటున్నారు. ఈ భూములపై తమకు శాశ్వత భూ హక్కు కల్పించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తు పరిశీలనలో భాగంగా గురువారం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ వారు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం ఆ గ్రామ సరిహద్దులో ఉన్న వైకుంఠపురం కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని సూచించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు రక్ష పథకంలో భాగంగా ఆ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన తనిఖీ చేశారు. మండల డిప్యూటీ తహశీల్దార్ కీర్తి సుధా స్రవంతి, సర్వేయర్ ఖాన్, నరమలపాడు వీఆర్వో ఎం.కోటేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యవర్గ సభ్యురాలిగా పుష్పావతి రామయ్య ఎన్నిక

విశాలాంధ్ర-రెంటచింతల: రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యవర్గ సభ్యురాలిగా రెంటచింతల గ్రామ సర్పంచ్ పూజల పుష్పవతి రామయ్య ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. విజయవాడ లోని మాకినేని బసవన్నయ్య భవన్ లో గురువారం జరిగిన రాష్ట్ర సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు పాపారావు అధ్యక్షతన సమావేశంలో నూతన కార్యవర్గ సంఘం ఎన్నిక నిర్వహించారు. రాష్ట్రంలోని 13,842 సర్పంచ్ లతో త్వరలో సమావేశం నిర్వహించి, సర్పంచ్ లు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. సమావే శంలో నారాయణపురం శ్రీనివాస్, పూజల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీఓ వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర-గురజాల : ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందిపెట్టేందుకు జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జీవోని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న ఆదరణ చూసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వణుకు పుట్టి చీకటి జీవోలు తీసుకువచ్చారని, చీకటి జీవోలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న వ్యక్తి, ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు అని, 7 సార్లు శాసనసభ్యునిగా గెలిచి తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనను ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమని, ప్రజాస్వామ్యాన్ని జగన్‌మోహన్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకొని కూని చేస్తున్నారని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, మద్దినేని లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు నేలపల్లి బొల్లయ్య, చాగంటి శీను, కొట్టే శ్రీనివాసరావు, పొత్తూరి శివనాగు, జాస్తి ప్రకాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
ఇ.పి. 209/2021, ఓ.ఎస్. 216/2019

రూల్ 66 నోటీస్
బిట్వీన్ :
తిరుమల శెట్టి శ్రీనివాసరావు, తండ్రి సత్యనారాయణ, హిందువు, వయస్సు 50 సంవత్సరములు, వ్యవసాయం, ఆర్/ఓ. జమ్మలమడక గ్రామము, పల్నాడు జిల్లా - డి.హెచ్.ఆర్
వర్సెస్
గొబ్బూరి రామాంజనేయులు, తండ్రి పున్నయ్య, హిందువు, వయస్సు 40 సంవత్సరాలు, వ్యవసాయం ఆర్/ఓ. జమ్మలమడక గ్రామము, పల్నాడు జిల్లా - జె. డి.ఆర్.

పై నెంబరు ఇ.పి ని తిరుమల శెట్టి శ్రీనివాసరావు మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో చేసియున్నారు. సదరు ఇ.పిలో ఆర్ 66 ప్రకారం శ్రీ కోర్టువారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు అందుబాటులోనికి రానందున శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం నోటీసు ఆర్డరు వేసియున్నారు. కావున పై నెంబరు ఇ.పిలో మీరు కోర్టువారి ఎదుటన **ఉదయం 10:30 నిమిషములకు** స్వయంగా గాని వకీల్ ద్వారా కానీ హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలియజేయని ఎడల పై నెంబరు ఇ.పి నందు శ్రీ కోర్టు వారు మీ వరోక్షమున తీర్మానము చేయుదురు అని తెలియజేయడమైనది.
వాయిదా ది. 25-1-2023.
కేళం శ్రీనివాసరావు, అడ్వకేట్
పిటిషనర్ తరపున, మాచర్ల

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి మాచర్ల వారి కోర్టునందు
ఇ.పి. 117/2020, ఇన్ ఓ.ఎస్. 336/2019

బిట్వీన్ :
షేక్ జహరాబి - డి.హెచ్.ఆర్/వాది
వర్సెస్
1) తెల్లబాటి కొండలు (లేటు) - జెడిఆర్1/ప్రతివాది.
2) తెల్లబాటి రామాంజనేయులు, తండ్రి (లేటు) కొండలు - జెడిఆర్/ప్రతివాది నెం.2
3) తెల్లబాటి శారద, భర్త (లేటు) కొండలు - జెడిఆర్/ప్రతివాది నెం.3
4) తెల్లబాటి అంజలి, తండ్రి (లేటు) కొండలు - జెడిఆర్/ప్రతివాది నెం.4

పై ప్రతివాదులు/జెడిఆర్ నెం.2 నుండి 4లు డోర్ నెం.10-153,17వ వార్డు మాచర్ల పట్టణ నివాసితులై ఉన్నారు.
ఇందు మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి, పై జెడిఆర్/ప్రతివాదులకు చెందియుండగా వారు డిహెచ్ఆర్/వాదికి రావలసిన పై నంబరు ఇ.పి. సొమ్మును ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వావసు చేసుకొనుటకు గాను ది.20-01-2023న ఉదయం 10:30 గంటలకు వేలం వేయుటకు గడువును నిర్ణయించినారు. కావున వేలంలో పాల్గొనదలచిన వారు పై తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై పాడుకొనగలరు.
షెడ్యూలు : నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా మాచర్ల సబ్ రిజిస్టర్ ఇలాక, మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని, గతంలో 17వ వార్డు ప్రస్తుతం 19 వ వార్డులో డోర్ నెం.10-153, అసెస్మెంట్ నెం.1022001484గా గల ఆర్‌సిసి స్లాబు ఇల్లు 0.02 సెంట్లులో 700 చదరపు అడుగులుగా నిర్మితమైన ఇంటికి
హద్దులు : తూర్పు : మట్టపల్లి సైదమ్మ ఇల్లు
పడమర :రోడ్డు, **దక్షిణం** : పోలగాని కొండలు ఇల్లు, **ఉత్తరం** : ఇమ్మడి వాసుదేవరావు స్థలం.
మార్కెట్ విలువ : 10,00,000/-
అమీనా విలువ : 35,00,000/-
డి.హెచ్.ఆర్. విలువ : 10,00,000/-
భవదీయ కోర్టు వారి ఆర్డర్ వేలం తేది. **20-01-2023, ఉదయం 10:30 గంటలకు** మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు.
గంగుల శ్రీనివాసరావు
న్యాయవాది- మాచర్ల.
సెల్ నెం. 9949436276.

సంక్షేమ పథకాలతో బలహీన వర్గాల అభ్యున్నతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతి చెందుతున్నారని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా అన్నారు. తూర్పు నియోజకవర్గం 51వ డివిజన్ మల్లిఖార్జునపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, గత ప్రభుత్వాలు పేద, బడుగు, బలహీనవర్గాల వారిని పట్టించుకున్న పాపానలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయటంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 51వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జ్ చెన్నుపాటి వెంకటరమణ, తూర్పు మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, వైసీపీ నాయకులు హైదర్, హుస్సేన్, తుమ్మేటి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం గొంతు నొక్కేందుకే అడ్డదారులు

విశాలాంధ్ర-పొన్నూరు: కుప్పం నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ర్యాలీని పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చింతలపూడి గ్రామంలోని ఆయన స్వగృహంలో తెల్లవారుజామున పోలీసులు గృహ నిర్బంధించారు. ఈ చర్యను నిరసిస్తూ ధూళిపాళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కొత్త కొత్త జీవోలను జారీ చేయడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలు, బహిరంగ సభలు నిర్వహించుకోలేదా అని ప్రశ్నించారు. అప్పుడు మా ప్రభుత్వం కొత్త జీవోలు తేలేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు వైకాపా ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతుందని రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం ప్రజలు చెబుతారని అన్నారు.

చీకటి జీవో రద్దు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జీవోని వెంటనే రద్దు చేయాలని జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కుప్పంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ వేములకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లాడ్జి సెంటర్, అంబేడ్కర్ విగ్రహం వద్ద జీవోని తగులబెట్టి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బ్రిటిష్ ప్రభుత్వం కన్నా దుర్మార్గంగా కుప్పంలో ప్రతిపక్ష నేత రోడ్డుషోను అడ్డుకున్నారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని వదిలి 75 సంవత్సరాలు గడుస్తుంటే, జగన్మోహన్ రెడ్డి మళ్ళీ బ్రిటిష్ పాలనను గుర్తు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిరాల గంగాధర్, మల్లె ఈశ్వరరావు, ధూళిపాళ్ళ ఏసుబాబు, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అభ్యుదయ సాధన వేదిక రాష్ట్ర కమిటీ ప్రకటన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మాదిగ అభ్యుదయ సాధన వేదిక (మాస్-వి) రాష్ట్ర అధికార ప్రతినిధులుగా చిట్టేరాజు, కొరివి ప్రేమ్ కుమార్, శుద్ధపల్లి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పిడతల అభిషేక్, నలుకుర్తి రమేష్, రాష్ట్ర కార్యదర్శులుగా నిరంజన్, కత్తి చలమరాజు, బూదాల సలోమి, సొంగా సంజయ్ వర్మ, మడికి కిషోర్ బాబు, కోశాధికారిణిగా గాజులవర్తి రజినిలను నియమించినట్లు మాదిగ అభ్యుదయ సాధన వేదిక రాష్ట్ర అధ్యక్షులు చావలి సునీల్ తెలిపారు. గురువారం స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు నందు రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని జిల్లాలకు అధికార కమిటీలను ప్రకటిస్తామని తెలిపారు.

ఏపీలో ఏమైనా ఎమర్జెన్సీ విధించారా?

విశాలాంధ్ర-దాచేపల్లి : ఏపీలో ఏమైనా ఎమర్జెన్సీ విధించారా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కార్యనిర్వాక కార్యదర్శి గుంటుపల్లి నాగేశ్వరరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జరిగిన ఘటనపై స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి మాట్లాడుతూ రాత్రికి రాత్రే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం బ్రిటీష్ చట్టానికి బూజు దులిపి అర్ధరాత్రి జీవో ఒకటి తేవడం అంబేద్కర్ రాజ్యాంగాన్ని తూట్లు పొడవడమేనన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు తన నియోజకవర్గంలో పర్యటించేందుకు మీ ఆంక్షలేంటి ప్రశ్నించారు. కుతంత్రాలన్నీ కుప్పంలో ప్రయోగిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రచారరథం స్వాధీనం చేసుకున్నా కార్యకర్తల్ని కొట్టిస్తున్నా నాయకుల్ని నిర్బంధించిన ఎన్ని అరాచకాలకు పాల్పడినా మీపై ప్రజావ్యతిరేకత తగ్గదన్నారు. చంద్రబాబు జనాదరణ ఇంకా పెరుగుతూనే ఉంటుంది. 35 ఏళ్లుగా కుప్పంలో మీలాంటి కుట్రదారులని ఎంతోమందిని టీడీపీ చూసిందని, తెలుగుదేశం కంచుకోట కుప్పంలో మీ కుప్పిగెంతులు చెల్లవన్నారు. పసుపుసైన్యం కదం తొక్కుతోందన్నారు. మీరు తల్లకిందులుగా తపస్సు చేసినా చంద్రబాబు కుప్పం పర్యటన ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి, మహిళా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరలక్ష్మి, నాయకులు హుస్సనమదు, తిరుమల కుమార్, అక్కినపల్లి బాలయ్య, తంగెళ్ళ శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, షేక్ తుల్లా తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-చిలకలూరిపేట : బైపాస్ రోడ్డు పనుల్లో భాగంగా తాగునీటి పైపులైన్లు బైపాస్ చేసే క్రమంలో ఈ నెల 9వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, చైర్మన్ షేక్ రఫానీ తెలిపారు. గురువారం చైర్మన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 9వ తేదీ నేషనల్ హైవే ప్రాజెక్టు వారు మంచినీటి పైపులు బైపాస్ చేసేందుకుగాను, చిలకలూరిపేట పట్టణానికి మంచినీటి చెరువు ద్వారా వచ్చే నీరు రాదని 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 10వ తేదీ ఉదయం 10 గంటల వరకు చిలకలూరిపేట పుర ప్రజలకు మంచినీరు అందించలేమని వారు తెలిపారు. అందువలన 9వ తేదీ ఉదయం వరకు తాగునీటి పట్టుకొని 9, 10వ తేదీ వాడుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఏఈ డి.రమణ, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమం కోసం వైసీపీ కట్టుబడి ఉంది'

విశాలాంధ్ర-వెల్దుర్తి : పేద ప్రజల అభివృద్ధి వారి సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని మాచర్ల శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్న మాట ప్రకారం పింఛన్‌ను ఈ ఏడాది రూ.2500 నుంచి రూ.2750లకు పెంచుతూ వృద్ధులకు ఆసరాగా నిలిచారన్నారు. అంతేకాకుండా మండలంలో మరో 239 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయని అన్నారు. ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసి పేద ప్రజలకు అండదండలుగా నిలబడి, వారికోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ బడుగు బలహీన వర్గాల కోసం మేనిఫెస్టోలో ఇచ్చిన వాటికంటే కూడా అదనంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇదే కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు రూ.19 కోట్ల చెక్కును ఎస్‌జీహెచ్ బ్యాంకు ద్వారా అందించారు. డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వాతంత్రాన్ని సంపాదించుకుని కుటుంబాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే వారి కుటుంబాలు చక్కగా ఉంటాయన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, రాజ్యాంగ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పించి రాజకీయంగా వారి ఉన్నతి కోసం జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింత శివరామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి, మార్కొండ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జడ్పీటీసీ బాలు నాయక్, ఎంపీడీఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మరింత పెంచాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మరింతగా పెంచాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై సంబంధిత ప్రధానాచార్యులతో గురువారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్లో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకునే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని గురుకుల పాఠశాలల్లో కల్పించాలని కలెక్టరు చెప్పారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. వారి నైపుణ్యాలకు మెరుగులుదిద్దాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో డ్రాపౌట్స్ నియంత్రించాలని ఆదేశించారు. జిల్లా పరిధిలో రెండు బాలుర, ఆరు బాలికల గురుకుల పాఠశాలలు నడుస్తున్నాయని 4321 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు విద్యాబోధన అందించాలన్నారు. డ్రాపౌట్స్ కారణాలపై సర్వే నిర్వహించి నివేదిక పంపాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో నైపుణ్యం సాధించడానికి అధ్యయన తరగతులు నిర్వహించాలని పాఠశాలలను సమర్థంగా నడపాలని చెప్పారు. వివిధ పాఠశాలల్లో మురుగునీటి సమస్య, వంటగ్యాస్ సమస్య పరిష్కరించాలని ప్రధానాచార్యులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రేపల్లే, యద్దనపూడి, అద్దంకి పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, మరమ్మతులకోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు త్రాగునీటి సమస్య రానివ్వరాదని ఆమె సూచించారు. గురుకుల పాఠశాలల్లో విద్యాకుసుమాలు వికసించేలా విద్యాబోధన ఉండాలన్నారు. ప్రత్యేకాధికారులు ప్రతి గురువారం తనిఖీ చేసే సమయాలలో సిబ్బంది సహకరించాలని పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పర్యావరణం, సామాజిక బాధ్యతపై విద్యార్థులలో అవగాహన కల్పించి ఉన్నతస్థాయికి ఎదిగే వేదికగా పాఠశాలలను తీర్చిదిద్దాలని ఆమె పలు సూచనలు చేశారు. నరసాయపాలెం పాఠశాలలో సౌర విద్యుత్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించాలని ఆమె ఆదేశించారు. వివిధ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల ద్వారా పరిపాలన వ్యవస్థ కుంటుపడకుండా మానవవనరులను సమకూర్చుకోవాలని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ సి. శాంతివిశాల ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

1998 మెమో రద్దుచేసేంత వరకూ ఐక్యంగా ఉద్యమిద్దాం

నేడు బాపట్లలో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం

మతోన్మాద శక్తులపై పోరాడాలని జేబీ శ్రీధర్ పిలుపు

విశాలాంధ్ర - బాపట్ల : చర్చిలకు వెళ్లే దళిత వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లు రద్దు చేయాలని 1998లో చేసిన కుట్రపూరిత మెమోను రద్దు చేసే వరకు ఐక్యంగా ఉద్యమించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ పిలుపునిచ్చారు. బాపట్లలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ భారతదేశ సంపదను పెంపొందించుటకు చేతివృత్తుల ద్వారా ఉత్పత్తులు పెంచుటలో ప్రభుత్వాలు అభివృద్ధి చెందటంలో ఎస్సీ,ఎస్టీ,ముస్లిం మైనార్టీ, బహుజన క్రైస్తవ పేద ప్రజలు ఉన్నారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో అన్నీ కులాల వరకు వారికి నచ్చిన ఆరాధ్య దైవాలను పూజించుకునే హక్కును కల్పిస్తూ చట్టబద్ధం చేసిందన్నారు. 1998 సంవత్సరంలో ఎస్సీలుగా ఉన్న దళిత వర్గాల చెందిన వ్యక్తులు చర్చిలకు వెళ్లుచున్నారని క్రైస్తవులుగా ఉండి రిజర్వేషన్లు పొందుతున్నారని ఆయా రిజర్వేషన్లు రద్దు చేయాలని కుట్రపూరిత ఆలోచనతో 1998 మెమోను ప్రవేశపెట్టిందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు 24 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన మెమోను అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధారణకు వచ్చాయన్నారు. ఇటీవల కాలంలో కొంతమంది ఎస్సీలు తహశీల్దారు కార్యాలయంలో కుల ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే మీరు క్రైస్తవులు కదా మీకు ఎస్సీ సర్టిఫికెట్లు ఎలా ఇస్తాము మీ గురించి విచారణ చేసి ఇస్తామని అధికారులు బెదిరించే విధంగా మాట్లాడుతూ ఇబ్బందులు పెడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. విద్య, వైద్య, ఉద్యోగ సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాజ్యాంగ రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత చేస్తే నేటి ప్రభుత్వాలు మతం మారుతున్నారన్న కారణంతో మానవ హక్కులకు భిన్నంగా రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లు మార్చాలని దేశంలో మతకల్లోలను ప్రేరేపిస్తున్నారన్నారు. మతోన్మాదులకు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఏర్పడిందని దేశవ్యాప్తంగా క్రైస్తవుల మీద ముస్లింలు మైనార్టీల మీద విపరీతమైన దాడులు జరుగుతున్నాయి. మసీదులు చర్చిలు పడగొట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్ బజరంగ్దళ్ వ్యూహరచనలు చేస్తున్నారన్నారు. ఇటీవల క్రిస్టమస్ ప్రార్థనలు జరుగుచుండగా చర్చిలలోకి గుంపుగా వచ్చి అక్కడ ఉన్న వారిని బెదిరించి పంపిస్తూ మతాలను రెచ్చగొడుతూ క్రైస్తవ ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్న ఘటనలో దేశంలో చోటుచేసుకుంటున్నాయన్నారు. తినే ఆహారం ధరించే దుస్తులు ఆంక్షలు విధిస్తూ చట్టరీత్యా నేరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలను మతోన్మాదాన్ని ప్రజలంతా చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. 1998 మెమోను ప్రభుత్వాలు రద్దు పరిచే అంతవరకు గ్రామాలలో పట్టణాలలో సదస్సులు ప్రదర్శనలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మెమో రద్దు చేసే వరకు ప్రతి ఒక్కరినే కలుపుకుంటూ శాంతియుత మార్గంలో ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని కోరారు.

బాబు చేతులెత్తేస్తే... జగన్ చేయూతనిస్తున్నారు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో దేశ చరిత్రలోనే ముందున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అచ్చంపేట మండలంలో నూతనంగా మంజూరైన 302 మందికి పెన్షన్లతో పాటు.. పెంచిన పెన్షన్లు అందజేశారు. తొలుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడం చేతగాని చంద్రబాబు.. సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమయ్యారన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రం కరోనా విలయతాండవం చేసినా.. సంక్షేమ పథకాలు మాత్రం ఆపలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా పెన్షన్లు పెంచుతున్నారని చెప్పారు. మొదట రూ.2 వేలు ఇచ్చిన సీఎం జగన్ ఇప్పుడు రూ.2750లు ఇస్తున్నారన్నారు. వచ్చే ఏడాది జనవరిలో రూ.3 వేలు పెన్షన్ ఇస్తామన్నారు. ప్రజలు చంద్రబాబు పాలనకు, సీఎం జగన్ పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలని కోరారు. 2019 ఎన్నికలకు ముందు పెదకూరపాడు నియోజకవర్గంలో కేవలం 29,910 మందికి మాత్రమే పెన్షన్ల రూపంలో రూ.3.07 కోట్లు ఇచ్చారన్నారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత.. 38,344 మందికి పెన్షన్ల రూపంలో ప్రతి నెలా రూ.10.59 కోట్లు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాయిరెడ్డి, కృష్ణనాయక్, విజయ, ప్రతాప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారం

విశాలాంధ్ర-గురజాల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా ఆనందంగా లేరని జగన్‌మోహన్ రెడ్డి తీరు పట్ల ప్రతిఒక్కరూ విస్మయం చెందాలని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా తెలుగుదేశం పార్టీకి అధికారం దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఈ మూడున్నర సంవత్సరాల్లో వైసీపీ వారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి, ప్రజలకు వైసీపీ వారు చేస్తున్న అక్రమాలను, అన్యాయాలను తెలియజెప్పి భరోసా ఇచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తలపెట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం 19వ వార్డులో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి-ఇదేం ఖర్మ మన గురజాలకి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం యరపతినేని 19వ వార్డులో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను, వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ పనితీరును వారి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అలాగే ఇదేం ఖర్మ మన గురజాలకి అనే నినాదంతో గురజాల నియోజకవర్గంలో 9 మంది తెలుగుదేశం పార్టీ నాయకులను హత్య చేయడం, అభంశుభం ఎరుగని 8 మంది చిన్నారులు వైసీపీ వారు చేసిన అక్రమ క్వారీ గుంతల్లో పడి చనిపోవడం, 9వ తరగతి విద్యార్థిపై అక్రమ కేసులు పెట్టడం, టీడీపీ సానుభూతిపరుల ఆస్తులను ధ్వంసం చేయడం, టీడీపీ కార్యకర్త ఇంటికి నిప్పంటించి వారి కుటుంబాన్ని సజీవ దహనం చేయాలని చూడటం, బ్యానర్లు చింపారనే నెపంతో ముక్కు పచ్చలారని చిన్నారులను రోజంతా పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టడం వంటి అనేక సమస్యల గురించి యరపతినేని కరపత్రాల రూపంలో ప్రజలకు వివరించారు. గురజాల టౌన్ కన్వీనర్ అడపా శ్రీను, మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగర పరిధిలో 5,01,507 మంది ఓటర్లు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్ 2023 అనంతరం గుంటూరు నగర పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం ఓటర్లు 5,01,507 మంది ఉన్నారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి (ఈ.ఆర్.ఓ.) కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మరి రివిజన్ ఓటర్ల తుది జాబితాను గురువారం నుండి ఎలక్షన్ బూత్‌ల్లో ప్రచురిస్తున్నామన్నారు. తూర్పు నియోజకవర్గంలో పురుషులు 1,15,130, స్త్రీలు 1,21,747, థర్డ్ జెండర్ 46 మంది ఓటు హక్కు కల్గి ఉన్నారని, పశ్చిమ నియోజకవర్గంలో పురుషులు 1,29,227, స్త్రీలు 1,35,303, థర్డ్ జెండర్ 54 మంది ఓటు హక్కు కల్గి ఉన్నారని పేర్కొన్నారు. 2022 నవంబర్ 9 నుండి మొదలైన స్పెషల్ సమ్మరి రివిజన్ 2023లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పశ్చిమ నియోజకవర్గంలో పురుషులు 2,276 మంది, స్త్రీలు 2,663, థర్డ్ జెండర్ 2 మంది, తూర్పు నియోజకవర్గంలో పురుషులు 2,620, స్త్రీలు 3,154 థర్డ్ జెండర్ 2 మంది నూతనంగా నమోదు అయ్యారని తెలిపారు. ఇందులో 18-19 ఏళ్ల వయస్సు గల యువతీయువకులు పశ్చిమ నియోజకవర్గంలో 2,320, తూర్పు నియోజకవర్గంలో 2,497 మంది అనగా మొత్తం 4,817 మంది నూతన ఓటర్లగా నమోదు అయ్యారని తెలిపారు.

నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అన్నంపెట్టే రైతన్నకు వైఎస్సార్ రైతు భరోసాతో ఏటా రూ.13,500 చొప్పున నియోజకవర్గ వ్యాప్తంగా రూ.140.36 కోట్లు పంపిణీ చేశామని తాడికొండ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గురువారం గుంటూరు కొరిటిపాడులో తన కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో తాడికొండ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలను గ్రామ స్థాయిలో తీసుకువచ్చి...ఈ-క్రాప్ మొదలు, ఉచిత పంటల బీమా, ఏ సీజన్‌లో నష్టాన్ని ఆ సీజన్ ముగిసేలోగా అంచనా వేసి ఇన్‌పుట్ సబ్సిడీ అందించటం, సున్నా వడ్డీ పంట రుణాలు, పగటి పూటే 9 గంటలు నాణ్యమై ఉచిత విద్యుత్తు వంటివి అందిస్తున్నామన్నారు. ఏకంగా నియోజకవర్గంలో 17,050 మందికి ఇళ్ళ పట్టాలు ఇచ్చామని, అది కూడా ఆ కుటుంబంలో అక్కా చెల్లెమ్మల పేరుమీద ఇచ్చినట్లు చెప్పారు. తాడికొండ నియోజకవర్గంలో సంవత్సరానికి రూ.15,000 చొప్పున అమ్మఒడి కింద 27,492 మంది లబ్ధిదారులకు రూ 41.23 కోట్లు పంపిణీ చేశామన్నారు. బైజూస్ సంస్థతో ఒప్పందంతో 8వ తరగతి పిల్లలకు ట్యాబ్స్, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన...ఇన్ని పథకాలతో విద్యారంగంలో తీసుకొస్తున్న ప్రతి మార్పు వెనకా.. పిల్లలందరి భవిష్యత్తు పట్ల జగనన్న ప్రభుత్వం తీసుకున్న బాధ్యత కనిపిస్తుందన్నారు. అధికారుల సహకారం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదని స్పష్టం చేశారు. తనని నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని వారి సమస్యల పరిష్కారం కోసమే మూడున్నరేళ్లుగా కష్టపడి పనిచేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లోనూ అధికారుల సహకారంతో మరింత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా 2024లోనూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తధ్యమన్నారు.

హాయ్ మెసేజ్ పెట్టు.. పోయిన ఫోను కనిపెట్టు

8978777833 వాట్సఫ్ నెంబర్ విడుదల చేసిన పోలీసులు

జిల్లా ప్రజలకు మరింత సేవలకు ఎస్పీ వకుల్ మరో అడుగు

ఇంటి నుంచే ఫిర్యాదు చేసే సదుపాయం

విశాలాంధ్ర - బాపట్ల : పోగొట్టుకున్న ఫోనును ఒక్క మెసేజ్‌తో కనిపెట్టే నూతన సాంకేతిక విధానాన్ని ఎస్పీ వకుల్‌జిందాల్ జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫోన్ పోయిందని ఏ మాత్రం చింతించకుండా మీకు అందుబాటులో ఉన్న మరో ఫోన్ నుంచి 8978777833 నంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే చాలు ఫోనును ట్రాక్ చేసే విధానాన్ని అందుబాటులోకి ప్రజల సౌఖర్యార్ధం మరో అడుగు ముందుకు వేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్ గోడప్రతులను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోను పోయిన బాధితులు పోలీస్ స్టేషన్‌కు రాకుండా ఇంటి వద్ద నుండి పోలీస్ సేవలు అందుకోవచ్చన్నారు. నూతన బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత ప్రజల సౌకర్యార్థం అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఇప్పటి వరకు దిశ యాప్, విజిబుల్ పోలీసింగ్, స్పందన వంటి అనేక కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించి బాధితులకు న్యాయం చేయగలుగుతున్నామన్నారు. అదేవిధంగా ఇటీవల మొబైల్ ఫోన్‌లు ఎక్కువగా పోగొట్టుకోవటం జరుగుతున్న నేపథ్యంలో మొబైల్స్ పోగొట్టుకున్న వారికి అతి సులువుగా అర్ధమయ్యే రీతిలో సర్వీస్ పిటిషన్లను పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉంచి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి ఇప్పటికే ఎంతోమందికి పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి ఇప్పించగలిగామన్నారు. జిల్లా ప్రజల సౌఖర్యార్ధం మరొక అడుగు ముందుకు వేసి బాధితులు స్టేషన్‌కు రాకుండా నేరుగా వారు ఉన్న స్థలం నుండి ఫిర్యాదు చేసే విధంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 8978777833కు హాయ్ అని మెసేజ్ పెట్టడం వలన వెంటనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సర్వీస్ పిటిషన్ బాధితుల మొబైల్‌కు పంపుతామని దానిలో ఫిర్యాదుదారు వారి వివరాలు ఫోన్ నెంబరు పోగొట్టుకున్న మొబైల్ యొక్క బిల్లు లేదా బాక్స్ ఫోటో ×వీజు× నెంబర్ వివరాలు ఆ లింకులో అప్లోడ్ చేస్తే దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. ఫోను దొరికే వరకు బాధితునికి అందుబాటులో ఉంటూ సమాచారాన్ని తెలుపుతూ ఉంటారని ప్రజలు తమ సమయాన్ని ఆదా చేసుకోవచ్చని ఇంటి వద్దనే ఉండి పోలీస్ శాఖ కల్పించే సౌకర్యాలు పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేసిన ఐటీ కోర్ టీం సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఎస్పీ గారు జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఏదైనా రద్దీ ప్రదేశాలు, సినిమా హాల్లో, రాజకీయ సభలలో, పబ్లిక్ మీటింగ్లు, ఊరేగింపులు, తిరునాళ్ళు, జాతరలు వంటి చోట్ల వారి మొబైల్స్ ను జాగ్రత్తగా ఉంచుకోవాలని ఒకవేళ అపహరణకు గురైతే ఫోన్ లో ఉన్న డేటా చౌర్యం జరిగి సైబర్ నేరాలు జరిగే ప్రమాదం కూడా ఉన్నదని కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ పి. శ్రీకాంత్ , చీరాల వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జున , అద్దంకి రూరల్ సీఐ ఎం. రోశయ్య , వెల్ఫేర్ ఆర్ఐ బి. శ్రీకాంత్ నాయక్ , ఐటీ కోర్ టీం ఎస్ఐ సీజే భరత్ పాల్గొన్నారు.

బిల్లులు పెండింగ్ లేకుండా అప్లోడ్ చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పూర్తి చేసిన పనుల బిల్లులు పెండింగ్ లేకుండా వెంటనే ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్, ఆర్డిఓ, మున్సిపల్ కమీషనర్లు, యంపీడీఓలు, తహశీల్దార్లు, పంచాయితీ రాజ్, హౌసింగ్ అధికారులు, ఎంఇఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన సచివాలయాల పరిధిలో గుర్తించిన ప్రాధాన్యత పనులపై వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మంజూరు చేసిన పనులలో పూర్తి అయిన వాటికి జనవరి 13 నాటికి అన్ని బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు. పేదలందరికీ ఇళ్ళ పథకానికి సంబంధించి జిల్లాలో స్లాబ్ లు పూర్తి అయిన ఇళ్ళను జనవరి 31 నాటికి, స్లాబ్ లెవల్ ఉన్న ఇళ్ళను ఫిబ్రవరి 15 నాటికి పూర్తి అయ్యేలా హౌసింగ్, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, యంపీడీఓ లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

విశాలాంధ్ర-భట్టిప్రోలు : స్థానిక తమ్మన మల్లికార్జున రావు ఉన్నత పాఠశాలలో గురువారం 300 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ వైద్య పరిఓలు నిర్వహించారు. భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సూపర్‌వైజర్, ఎన్ఎంలె, ఆశ వర్కర్లు పరీక్షలు నిర్వహించి రకత హీనత గుర్తించిన వారికి ఐరన్ టాబిలెట్లు పంపిణీ చేశారు. రక్తం వృద్ధి చెందెందుకు ఆహారంగా తీసుకోవల్సిన పదార్దాలు, పండ్లు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న బాబు, కళ్యాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, కోటేశ్వరమ్మ, ఎం. సత్యరత్న, అనూల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును కాపాడాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత రాజ్యాంగంలో పొందుపరిచిన భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని 'అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్-లిటరేచర్' ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్ అన్నారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన మేధావి బైరి నరేష్‌కు మద్దతుగా దళిత బహుజన పాత్రికేయ హేతువాద సంఘాలు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ దళిత బహుజన మేధావి, హేతువాది బైరి నరేష్ అయ్యప్ప జన్మ వృత్తాంతం వివరించినందుకు కొంతమంది హిందూ మతోన్మాదులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ఆయనపై దాడి చేయడమేకాక అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హేతువాదం భారతీయ వారసత్వ సంపద అని, భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, ఆదేశిక సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. తక్షణం బైరి నరేష్‌పై అక్రమ కేసును ఉపసంహరించాలని, ఆయనపై దాడి చేసిన వారిని తీవ్రంగా శిక్షించాలని విల్సన్ డిమాండ్ చేశారు.

ఆశ్రమంలో నేడు ముక్కోటి అభిషేకాలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పట్టణంలోని గుంటూరు రోడ్‌లో ఉన్న శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వెలసివున్న శ్రీ మల్లికార్జున స్వామికి ముక్కోటి ఆరుద్రోత్సవం సందర్భంగా పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వంశపారంపర్య ధర్మకర్త మఠాధిపతులు లలితాంబ మాతాజీ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి మహన్యాసపూర్వక పంచామృత అభిషేకాలు జరుగుతాయన్నారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం పరమేశ్వరుని జన్మ నక్షత్రమని పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాతాజీ తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అభిషేక కార్యక్రమాలలో పాల్గొనదలచిన భక్తులు 9491300312 నెంబర్ సంప్రదించాలన్నారు.

నియంతృత్వ పోకడలకు జీవో నిదర్శనం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మరియు ఏఐ సిసి టి యు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం వినుకొండ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఉన్నది భావ స్వేచ్ఛకి భావ ప్రకటనలకి సంకెళ్లు వేసిన విధంగా ఉన్నదని ఇది ఫ్యాషి జానికి నమూనాగా పోలిక ఉందని నేతలు మాట్లాడారు. ఇలాంటి జీవోలు మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో పనికిరావని ఇది నియంత్రత పోకడలకు నిదర్శనమని ప్రజాస్వామ్యంలో పాలకవర్గాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసినప్పుడు నిరసన వ్యక్తపరిచే హక్కు ప్రతి పౌరుడికి ఉండాలని ఆ స్వేచ్ఛను హరించే విధంగా ఉందని వెంటనే జీవో ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీవో కాపీలని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు తోట ఆంజనేయులు, సిపిఐ ఎంఎల్ లేబరేషన్ పార్టీ పట్టణ కార్యదర్శి ఎం చిదంబరం, రఫీ ,ఏఐసీసీ టు యు పట్టణ కార్యదర్శి ఎస్కె ఫిరోజ్, పట్టణ అధ్యక్షులు భాస్కర్, దుర్గాప్రసాద్, కొనిధుల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

7న జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 7వ తేదీన జరిగే జూనియర్ సివిల్ జడ్జీ పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్దులకు ఆన్లైన్ పరీక్ష ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు జరుగుతుందని, పరీక్షా సమయానికి ముందుగా అనగా 09.45 గంటలకు ప్రధాన ద్వారం మూసివేయబడుతుందని, ఆ లోపల అభ్యర్దులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన అనుమతించడం జరగదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.బి.ఎస్.బి.జి. పార్థసారథి పేర్కొన్నారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 31 జూనియర్ సివిల్ జడ్జీ పోస్టులకు గాను మూడు కేంద్రాలలో 791 మంది అభ్యర్దులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. అయాన్ డిజిటల్ జోన్ చల్లావారిపాలెం నల్లపాడు కేంద్రం నందు 250 మంది, బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రం నందు 291 మంది, యూనివర్శిల్ కాలేజీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రంలో 250 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. అభ్యర్దులు హాల్ టికెట్‌తో పాటు ఐడి ప్రూఫ్‌గా అడ్వకేట్ ఐడి కార్డు, ఓటరు ఐడి, గవర్నమెంట్ ఐడి, ఆధార్, పాస్ పోర్టు ఐడి లలో ఏదైనా ఒకటి ఒరిజనల్ తీసుకురావలన్నారు. హాల్ టికెట్ లో ఫోటో లేక పోయినా, ఫోటో క్లారిటీ లేకపోయినా మూడు పాస్ పోర్టు సైజు ఫోటోలపై గెజిటెడ్ ఆఫీసర్ చేత ధృవీకరణ చేయించి తీసుకురావాలని, ఎట్టి పరిస్తితుల్లో సెల్‌ఫోన్లు అనుమతించబడవని, అభ్యర్దులు హాల్ టికెట్‌లో పొందు పరచిన సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు.

బీసీలు ఏకం కావాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీకి బిసిలు వెన్నెముక లాంటివారని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను సంవర్ధవంతంగా ఎదుర్కొని పోరాడాలంటే బిసిలందరూ ఏకం కావాలని టీడీపీ బీసీ నాయులు పిలుపునిచ్చారు. అన్నారు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకునే వైకాపా పార్టీని తరిమి కొట్టడానికి బిసిలందరు సిద్ధంగా వుండాలని పిలుపిచ్చారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా బిసి విభాగం సర్వసభ్య సమావేశం జరిగింది. తూర్పు ఇంచార్జి నసీర్ అహ్మద్ మాట్లాడుతూ బీసీల ద్రోహి జగన్ రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించడానికి బీసీలు కంకణం కట్టుకోవాలని అన్నారు. రాష్ట్ర బిసి విభాగం ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ టీడీపీ బిసి నేతలందరూ కష్టపడి పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నిమ్మల శేషయ్య, మల్లె ఈశ్వరరావు, ధూళిపాళ్ళ ఏసుబాబు, బేళ్ళ వెంకటేశ్వరరావు యాదవ్, బత్తిన శంకర్, గిరి గణేష్, మారాసు మురళీకృష్ణ, చంద్రగిరి బాబు పాల్గొన్నారు.